నేటి నుంచి లోక్ అదాలత్

షాద్‌నగర్‌టౌన్, మార్చి 13: షాద్‌నగర్ కోర్టులో గురు, శుక్ర, శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా నిలిచిపోయిన లోక్ అదాలత్‌ను మూడురోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ లోక్ అదాలత్ స్పెషల్ ఆఫీసర్‌గా విశ్రాంత జిల్లా న్యాయమూర్తి రవీంద్రసింగ్, సభ్యుడిగా న్యాయవాది సీహెచ్ శ్రీనివాసమూర్తి ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాతరకు తీసుకెళ్ల లేదని వివాహిత ఆత్మహత్య

చేవెళ్లటౌన్, మార్చి 13: జాతరకు తీసుకెళ్లలేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చేవెళ్ల ఎస్సై వీరబ్రహ్మం తెలిపిన వివరాలు.. వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లికి చెందిన రేణుక (28) తన భర్తతో కలిసి మూడు నెలల క్రితం జీవనోపాధి కోసం చేవెళ్లకు వచ్చారు. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి చేవెళ్లలో జరుగుతున్న శివరాత్రి జాతరకు తీసుకెళ్లాలని భర్తతో గొడవపడింది. దీంతో మనస్తాపం చెంది చీర సాయం ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, మార్చి 13 : మండల పరిధిలోని చరికొండ గ్రామంలో కొలువుదీరిన రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం, భేరి పూజ, దేవతాహ్వానం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చక్రవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చక్రవర్తి రామాచార్యులు, చక్రవర్తి కృష్ణామచార్యులు, చక్రవర్తి వేణాచార్యులు, కిరణ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ

క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 13 : మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాంటేకార్ రమేశ్‌జీ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస్‌లను సొంత ఖర్చుతో బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలోనే పాఠశాలల్లో ఉపాధ్యాయులను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖ, జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ మేడిపల్లి బాలమ్మ, డీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో వెంకట్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కొత్తపల్లి జయపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌గౌడ్, బుర్ర మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిధుల కోసం వినతి

అబ్దుల్లాపూర్‌మెట్ : మజీద్‌పూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని తాజా మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనాజ్‌పూర్ రోడ్డు నుంచి నెర్రపల్లి చౌరస్తా వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు, అంతర్గత సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం తదితర పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు.

'బిల్లులను మంజూరు చేయించాలి

తుర్కయాంజాల్ : మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు గత 5 నెలల పెండింగ్ బిల్లులు, 4 నెలల గౌరవ వేతనం, 3 నెలల బ్రేక్‌ఫాస్ట్ బిల్లులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 13: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రకటన చేయడంతో పట్టణంలోని ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుతో ఆర్యవైశ్యులకు మరింత లబ్ధి చేకూరనున్నదన్నారు. ఆర్యవైశులు విద్య, వైద్యం, రాజకీయంగా, ఆర్థికంగా రాణించాలన్నారు. ఆర్యవైశ్యుల్లో అందరూ ధనికులే ఉండరని, వారిలో కొంతమంది పేదవారు కూడా ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని, ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

గ్రామ పంచాయతీ కార్మికుల బకాయిల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలను పెంచాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పంచాయతీ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబు, గ్రామ పంచాయతీల కార్మికులు జంగయ్య, మల్లేశ్, సురేశ్ పాల్గొన్నారు.

సంక్షేమ సంఘాలు కీలకం

వనస్థలిపురం, మార్చి 13 : అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘాలు పాత్ర కీలకమని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. హస్తినాపురం సౌత్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్న నేపథ్యంలో నూతన కార్యవర్గం బుధవారం కార్పొరేటర్‌ను కలిశారు. కార్యక్రమంలో కాలనీ నూతన అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పావని, ప్రకాశ్, రాంప్రసాద్, ఎస్.ఎస్.రెడ్డి, శ్రీకృష్ణ, హనుమంతరావు, సుమతి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

ఎల్బీనగర్, మార్చి 13 : కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ కమర్షియల్ ట్యాక్స్ కాలనీ రోడ్ నం.3 లోని డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. కొన్నేండ్లుగా మురుగు సమస్యలు ఉన్నట్లుగా తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో కాలనీవాసుల సహకారంతో సంబంధిత జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసి పనులు జరిగేలా చొరవ తీసుకున్నానని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షల వెల్లువ

ఎమ్మెల్సీ కవితకు సాయిబాబా పటాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జాగృతి నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 13 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు వేరు వేరుగా ఆమను నగరంలోని నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

షాద్‌నగర్‌టౌన్ : నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బుధవారం షాద్‌నగర్ భారత జాగృతి నియోజకవర్గ కన్వీనర్ ముస్తఫా, విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ బాలాజీ ఉదయ్ నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కవితకు సాయిబాబా పటాన్ని అందజేశారు. కార్యక్రమంలో భారత్ జాగృతి నాయకులు పాల్గొన్నారు.

జన జాతర వాల్ పోస్టర్ విడుదల

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

తుర్కయంజాల్,మార్చి 13: ఏప్రిల్‌లో జరిగే మహనీయుల జన జాతరను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ సామ్యూల్ అన్నారు. బుధవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను జన జాతర పేరుతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జన జాతర పోస్టర్‌ను విడుదల చేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మొయినాబాద్, మార్చి 13 : మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గ్రామానికి చెందిన గన్నెపాగ నర్సింగ్ రావు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గోపాల్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఆంజనేయులుగౌడ్, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటయ్య, నాయకులు ఎన్ రాములు, బిక్షపతి, ఎన్ పద్మా రావు, సీహెచ్ వినోద్‌కుమార్, జి శేఖర్, వెంకటేశ్, జాఫర్, హరిశంకర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పోషణ పక్షోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

షాద్‌నగర్‌రూరల్, మార్చ్ 13: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని విఠ్యాల గ్రామంలో బుధవారం అన్నారం అంగన్‌వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్పవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 28 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు పౌష్టికాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు.

32తులాల బంగారు ఆభరణాలు మాయం

మొయినాబాద్, మార్చి 13: ఇంట్లో బీరువాలో దాచి పెట్టిన 32 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఇంట్లో పని చేసే మహిళే తీసి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుదవారం జరిగింది. ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మొయినాబాద్‌లోని సహారా కాలనీలో మహ్మద్ చాంద్‌పాషా కుటుంబం నివాసం ఉంటున్నది. వారి అవసరాల కోసం తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను ఈ నెల 7న విడిపించుకొచ్చి ఇంట్లో బీరువాలో దాచి ఉంచారు. బుధవారం మధ్యాహ్నం బీరువాలో చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో 32 తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో పని చేసే మహిళే తీసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మానసిక వేదనతో ఆత్మహత్య

యాచారం, మార్చి 13 : ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన దోస గుండాలు చిన్న కుమారుడు దోస శ్రీధర్ (24) ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నాడు. కానిస్టేబుల్ ఉద్యోగానికి అతను అర్హత సాధించలేకపోయాడు. దీంతో కొంత కాలంగా మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి తన సోదరుడు శ్రీకాంత్ ఇంటికొచ్చి చూడగా.. తమ్ముడు ఉరేసుకొని చనిపోయినట్లు గుర్తించి బోరున విలపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల పనివేళలు మార్చాలి

హయత్‌నగర్ డీసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్బీనగర్, మార్చి 13 : ఎండాకాలం నేపథ్యంలో పారిశుధ్య కార్మికులకు వడదెబ్బ తగులకుండా పనివేళలను మార్చాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ యాదయ్య, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల ఉప కమిషనర్లకు వినతిపత్రం సమర్పించారు.

సామాన్యులకు అందుబాటులో..

డిజిటల్ విప్లవాన్ని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి జీఎస్ఐ సమీపంలోని మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో బుధవారం ఉదయం కార్పొరేటర్ చింతల అరుణ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమానికి ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. **- మన్సూరాబాద్, మార్చి 13**

'రౌడీషీటర్లపై నిఘా ఉంటుంది'

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

మన్సూరాబాద్, మార్చి 13 : పార్లమెంటు ఎన్నికలు సమీస్తున్న తరుణంలో ఎల్బీనగర్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని రౌడీ షీటర్లను బుధవారం స్టేషన్‌కు పిలిపించి ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, గొడవలకు దిగినా.. బెదిరింపులకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సీఐ ఎల్. రామాంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు గుప్తాకు ఉత్తమ కార్యదర్శి ఎక్సలెంట్ అవార్డు

కందుకూరు. మార్చి 13: కందుకూరు లయన్స్ క్లబ్ కార్యదర్శి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా ఎక్సలెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. గీతాంజలి రీజియన్ కాన్ఫరెన్స్‌లో కందుకూరులో క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు గుప్తాకు ఉత్తమ కార్యదర్శి అవార్డును రీజియన్ చైర్మన్ సాదు ప్రభాకర్‌రెడ్డి, మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి, జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, కాన్ఫరెన్స్ చైర్మన్ సుధాకర్ రెడ్డి అందజేశారు. లయన్స్ క్లబ్‌కు బెస్ట్ మీల్స్, బ్లడ్ డొనేషన్, డయాబెటిక్ క్యాంప్ అవార్డులు వచ్చాయి అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అవార్డులను అందుకున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

సైదాబాద్, మార్చి 13 : కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆస్మాన్‌ఘడ్, ఎస్‌బీహెచ్ కాలనీ, వెంకటాద్రి కాలనీలో కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటామని.. సమస్యలుంటే తెలుపాలని కోరారు.

మహిళా మోర్చా నాయకులు సైదాబాద్ డివిజన్ ఎల్‌సీహెచ్ కాలనీలోని మహిళా భవన్‌లో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ అరుణా రెడ్డి పాల్గొన్నారు.

- సైదాబాద్, మార్చి 13

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

మలక్‌పేట, మార్చి 13 : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహచర మంత్రి వర్గానికి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్ – రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి దోహదపడుతున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని ఆర్యవైశ్య మహాసభ తరపున తాను ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకోవాలి

- నియోజకవర్గంలో ఘనంగా మొల్లమాంబ జయంతి

ఇబ్రహీంపట్నం : కవయిత్రి మొల్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం/ ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 13 : తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబను నేటి మహిళాలోకం ఆదర్శంగా తీసుకోవాలని కుమ్మరి సంఘం సీనియర్ నాయకుడు గంధంగూడ వెంకటేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు కాసుల పాండు అన్నారు. తొలితెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని బుధవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అలాగే యాచారం మండలం గున్‌గల్ గ్రామంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని కుమ్మరి సంఘం గ్రామ అధ్యక్షుడు చిలుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సింహ, లక్ష్మన్, గణేశ్, జగన్, శ్రవణ్‌కుమార్, కృష్ణ, మల్లేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే గాంధీతో సాయిరాం కాలనీ వాసులు

మియాపూర్ , మార్చి 13 : కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి..మౌలిక వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నా రు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రభుత్వంతో కొట్లాడైనా నిధులు సమీకరించి డివిజన్ లను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్, సాయిరాం నగర్ కాలనీలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై డివిజన్ పార్టీ అధ్యక్షుడు బాలింగ్ గౌతంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే గాంధీని కాలనీవాసులు కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల పురోగతి బాధ్యత తనదేనని, ఎప్పటికప్పుడు కాలనీల అవసరాలను తెలుసుకుని వాటిని తీర్చేందుకు నిరంతర కృషి చేస్తానన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ. 9వేల కోట్ల నిధులు వెచ్చించి విస్తృతమైన మౌలిక వసతులు కల్పించామని అన్నారు. కాలనీవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని, సౌకర్యాలు కల్పించి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాండు, బాబు, వెంకటేశ్ , జితేందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా ఉదయ్

కందుకూరు, మార్చి 13 : కందుకూరు గ్రామ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా ఎడ్ల ఉదయ్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ఖదీర్ తెలిపారు. గ్రామంలో బుధవారం మత్స్యకారుల సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి తీర్మానించారు. మత్స్యకారుల అధికారి ఖదీర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షుడు ఎడ్ల లింగమయ్య, కార్యదర్శిగా ఎడ్ల శ్రీనివాస, డైరెక్టర్లుగా నర్సింహ, వెంకటయ్య, ఎడ్ల రవీందర్, ఎడ్ల కృష్ణ, లక్ష్మయ్య ఎంపికైనట్లు ప్రకటించారు.